## అద్దె ఇంటి అల్లుళ్ళు

ఎన్నికల్లో పెద్ద మెజార్టీతో గెలిపిస్తామన్న కార్యకర్తల్ని నమ్ముకుని డిపాజిట్ కోల్పోయిన అభ్యర్థిలా మండి పడుతున్న గ్రీష్మ ఋతువు ఎండ వడ దడ దడ లాడిస్తుంది.

సన్నగా పొడుగ్గా ఉన్న శంకరావు ఉసూరు మంటూ గుమ్మం ముందు నిల్చున్నాడు. కుడి చేతిలో గొడుగు, ఎడమ చేతిలో సంచి, అరవై వసంతాల అనుభవాలు మొహమ్మీది మడతలుగా దర్శన మిస్తున్నాయి.

"ఏవండీ.... రామానుజం ఇల్లు ఇదేనా?" హీన స్వరం స్థాయి కొంచెం పెంచి మరోసారి అడిగాడు.

"ఇదేనండీ... రండి లోపలికి..." వచ్చినాయనను తేరిపార జూచి నిశ్చేష్టురాలైంది పార్వతమ్మ. ముఖారవిందము వాడిపోయింది.

అప్పుడే అటువైపొచ్చిన రామానుజం కళ్లు జిగేల్ మన్నాయి. నరాల్లో కొత్త రక్తం ప్రవహించింది,

"నువ్వా శంకరం... ఎన్నాళ్ళయిందీ... రా రా..." అంటూ ఆప్యాయంగా ఆహ్వానించి గుండెలకు హత్తుకున్నాడు.

పరమశివుని జటాజూటం విడి వడి పొంగుకొచ్చిన గంగా నదిలా శంకరావులో జీవశక్తి పరుగులు తీసింది.

" బావున్నావా రామానుజం! " అంటూ మండువాలో కొచ్చాడు - ఆయాసం బయడపడొద్దని ప్రయత్నిస్తూ.

"ఉత్తరం ముక్కయినా రాయకుండా ఊడిపడ్డా వేమిటా్రి! అక్కడ మీవారంతా బాగేనా?" అన్న రామానుజం ఎదుటి మనిషి జవాబు కెదిరిచూడ కుండా "వీడు నా కొడుకు ప్రసాద్ - ఆయిల్ మిల్లులో మేనేజరు. ఈవిడ కోడలు అహల్య" పరిచయాలు ముగించేశాడు.

ఆనాటి రామానుజంలో ఏమీ మార్పు రాలేదని అట్టే అర్థమైపోయింది.

శంకరా్రివు, రామానుజంలు ఒకనాటి ప్రాణ స్నేహితులు. ఒకే రోజు, ఒకే ఆఫీసులో జాయినయ్యారు, ఒకే అద్దెగదిలో ఉండేవారు. వయస్సులో శంకరా్రివు రెండేళ్ళు పెద్దయినా స్నేహ బంధం ఇంటి యజమాని నాకట్టు కుంది. ఫలితంగా ఇంటి యజమాని పుత్రికా రత్నాలు శారదమ్మ, పార్వతమ్మ లను తమ వెంట ఏడడుగులు నడిపించుకొని అద్దె ఇంటి అల్లుళ్లయి పోయారు. ఆ తర్వాత ట్రాన్స్ఫర్లై విడిపోయారు.

అదేమిటోగాని .... ఎనిమిదేళ్ళు నిత్య వసంతం పచ్చ తోరణంగా గడిచినా శారదమ్మ, పార్వతమ్మల కడుపులు పండలేదు. వ్రతాలూ, నోములూ క్రమం తప్పలేదు. పెద్ద పెద్ద డాక్టర్లు పరీక్షలవీ చేసి అక్కాచెల్లెళ్లిద్దరికీ మాతృయోగం లేదని తేల్చేశారు.

తండ్రైతీరాలనే తహ తహ శంకరా్రివును నలుచుకు తినడం ప్రారంభించింది. శారదమ్మ దసరా నవరాత్రులకు పుట్టింటి కెళ్ళిందే/తడవు మరో అమ్మాయి మెడలు వంచి మూడు ముళ్లు బిగించాడు. విషయం తెలిసిన శారదమ్మ గుండెలు బాదుకుంది. గుండెలవిసేలా గోడు గోడున ఏడ్చింది. అదే రాత్రి ఉరేసుకుని తన దారి తాను చూసుకుంది.

రామానుజం దంపతులు అనాధ శరణాలయం నుండో కుర్రాడిని తెచ్చి పెంచుకున్నారు. ఆ కుర్రాడే ప్రసాద్. ఐతే .... శారదమ్మ మరణ శాసనం రాసింది శంకరా్రివేననీ, నిర్దాక్షిణ్యంగా ఓ అమాయకురాలిని పొట్టన బెట్టుకున్నాడనీ బంధువర్గ మతన్ని వెలేసింది. ప్రాణ స్నేహితుల మధ్య దూర మధికమైంది. శంకరా్రివుకో ఉత్తరంముక్క రాద్దామన్నా పార్వతమ్మ ఒంటి కాలుమీద లేచి రామానుజాన్ని సాధించేది. రెండు మూడుత్తరాలకు జవాబు రాకపోవడంతో శంకరా్రివుగూడా వెనక్కుతగ్గారు. ఐనా... వారిద్దరి హృదయాల్లో స్నేహ వీచికలు గూడు కట్టుకొనే వున్నాయి - నివురు గప్పిన నిప్పులా.

పాతిక సంవత్సరాల తర్వాత కొత్తగా కనబడిన శంకర్రావును చూడగానే రామానుజం గుండెలు పున్నమి చంద్రుని కోసం పొంగిన సముద్రకెరటాలైనాయి.

అద్దె ఇంటి బ్రహ్మచారి జీవితాలు ఇద్దరి కళ్ళముందు తిరిగాయి. వెనుకటి రోజుల్ని నెమరేసుకుంటూ తృప్తిగా నవ్వుకుంటూ మూడ్రోజులు గడిపారు. మాటల మధ్యన రామానుజం పెంపుడు కొడుకూ- కోడలూ యోగ్యతలనీ రామామజం - పార్వతమ్మలను దేవతల్లా భావిస్తున్నారనీ తెలిసిపోయింది. కాని శంకర్రావే తన విషయాలను కావాలనే దాస్తున్నాడనిపించింది.

నాల్గోరోజు ఉదయం అల్పాహారాలైన తర్వాత.

" ఒరేయ్ శంకరం! నీ రెండో భార్యా పిల్లల గురించి తెలుసుకోవాలనుందిరా!" అడిగాడు రామానుజం కాఫీ గ్లాసందిస్తూ.

శంకర్రావు వెన్నుపూసలో సన్నని వణుకు రెక్కలు విప్పింది. గంభీరంగా మారిపోయాడు.

" మీ కభ్యంతరమైతే చెప్పకండి బాబాయ్!" నిట్టూర్చాడు ప్రసాద్.

" పోయిన అక్కయ్య ఎలాగూ తిరిగిరాదు. మీరైనా సుఖంగా ఉన్నారా?" ఆసక్తిగా ప్రశ్నించింది పార్వతమ్మ.

" నా విషయాలు మీక్కాక ఇంకెవరికి చెబుతాన్రా రామానుజం? " అంటూ పడక్కుర్చీలో ఒరిగాడు శంకర్రావు. చూపులు శూన్యంలోకి చొచ్చుకుపోతున్నాయి.

" ఆనాడు.... శారదను ఒప్పించే ధైర్యం చాలక గుట్టుగా మరో పెళ్లి చేసుకున్నాను. తర్వాత శారదే సర్దుకుంటుందని భ్రమ పడ్డాను. నన్ను నట్టేట్లో ముంచి పోతుందనుకోలేదు. నా రెండో భార్య కడు బీద కుటుంబము లోంచి వచ్చింది. గుట్టుగా కాపురం చేసుకుంటుందనుకున్నాను. మాటిమాటికి పెట్రేగి అధికారం చెలాయిస్తుందనుకోలేదు. నేనెంత ప్రయత్నించినా, ఎన్ని నీతులు చెప్పినా బూడిదలో పోసిన పన్నీరైపోయినాయి. సంతానవతైంది గానీ, సద్గుణవతి కాలేదు. ఆవిడనుకున్నది కాకపోతే నూతిలో దూకుతానని పరుగెత్తుతుంది. నేనే రాజీ పడాల్సొచ్చింది. ఇద్దరు కొడుకులకేలోటూ లేకుండా పెంచాను, చదివించి ఉద్యోగాలిప్పించాను. పెళ్లిళ్ళు గూడా ఘనంగా చేశాను." దగ్గు తెర ముంచుకొచ్చింది.

గ్లాసుతో నీళ్ళందిస్తూ "పోనీ కొడుకులైనా బాగా చూసుకుంటున్నారా?" అడిగాడు రామానుజం.

"వాళ్ళగ్గూడా నేను లోకువై పోయానా్ర! తల్లి దారిలో తనయులు నడుస్తున్నారు. ఇంట్లో నేనొక మనిషినే నన్న సంగతి ఎప్పుడో మరిచిపోయారు. నేను రిటైర్మెంట్ తర్వాత నా గ్రాట్యుటీ, ప్రావిడెంటు ఫండుతో ఇల్లు కొనేశారు. నేను పంజేసింది కార్పొరేషన్లో కాబట్టి పెన్షన్ రాదు. నా బ్రతుకు మరీ దుర్భరమైంది. వాళ్ళింటి మీద పడి నేనేదో దోచుకు తింటున్నట్టు ఆడిపోసుకుంటున్నారు. కోడళ్ళను నోరెత్తనివ్వరు." శంకర్రావు కళ్లు మేఘావృతమైనాయి.

"ఏదైనా పంజేసి నాలుగు డబ్బులు సంపాదిద్దామనుకున్నాను గాని ఈ వయసులో ఏం చెయ్యాలి? ఎలా సంపాదించాలి? తింటే ఆయాసం, తినకుంటే నీరసం. అప్పుడప్పుడు గుండెనొప్పి నేనున్నానంటుంది. ఐదు రోజుల క్రితం మా పెద్దోడు

"ఇంట్లో కూచుండి గోళ్లు గిల్లు కోకుండా ఏదో ఒక కూలీ పంజేసి నాల్గు రాళ్లు సంపాదించవచ్చుగదా!" అనేశాడు మింగేస్తానన్నంత కోపంతో.

వెంటనే చిన్నవాడందుకుని "ఎందుకు చేస్తాడన్నయ్యా! ఈయన మహారాజుగదా! సంపాదించి తెచ్చేందుకు మనమున్నాం, వండి పడేసేందుకు అమ్మ వుంది. పండుకునేందుకు పడక్కుర్చీ వుంది. తేరగా వచ్చింది మెక్కుతున్నాడు" అంటూ పళ్ళు నూరాడు.

నా నెత్తిమీద బాంబు పేలింది, కాళ్ల కింది నేల కదిలి పోయింది. కోపం కట్టలు తెంచుకుంది, నోటి దురద తీరేలా తిట్టానంతే....

రక్తముడిగిన తర్వాత రక్తం పంచుకున్న వాళ్లు రక్షిస్తారనుకున్నాను, కానీ రక్తం కళ్ళ జూస్తారనుకోలేదురా!"

శంకర్రావు ఆపుకుందామని ఎంత ప్రయత్నించినా ఆగని కన్నీటిబొట్లు టపీన రాలాయి. *

(జాగృతి సంక్రాంతి ప్రత్యేక సంచిక 13-1-1992)